

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-రాజోలు

మండల స్థాయిలో ఆగస్టు నెలకు సంబంధించి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్కూల్ కాంప్లెక్స్ తరగతులు ఎంపిఎ ప్రాథమిక కో ఆపరేటివ్ పాఠశాల నందు నిర్వహించారు. విద్యాశాఖ విడుదల చేసిన టైం టేబుల్ ప్రకారం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మరియు సెక్రటరీల పర్యవేక్షణలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి నల్లి మనోహరం మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమలు రెండు రోజులు నిర్వహిస్తామనన్నారు. మొదటి రోజు సగం మంది, రెండోరోజు సగం మంది ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. ఈ శిక్షణ తరగతుల వలన ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాలు పెంపొందించుటకు అవకాశం కలుగుతుందన్నారు. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సబ్జెక్ట్ తరగతులు రాజోలు బాలుర ఉన్నత పాఠశాల నందు నిర్వహించామన్నారు.

ధరల అదుపులో కేంద్రం విఫలం

- సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు
- సెప్టెంబర్ 4 వరకు సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి-అమలాపురం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపుచేయడంలో ఘోరంగా విఫలమైందని సిపిఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు రాష్ట్రంలో జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన అన్నారు. అధిక ధరలు , విద్యుత్ ఛార్జీలు, నిరుద్యోగం సంబంధించిన నిరసన కార్యక్రమాల పోస్టర్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట పార్టీ సభ్యులతో ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దెనెక్కిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నులు భారాన్ని మోపుతున్నదన్నారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసి ఆదాయాలు రాబడుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, అధిక ధరలను అదుపు చేయాలని, సరసమైన ధరలకు నిత్యావసరాలు అందించాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలని మార్క్సిస్టు పార్టీ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని ప్రజలందరూ భాగస్వాములు కావాలని అన్నారు. ప్రజలను పీడిస్తున్న అధిక ధరలు రోజురోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు హద్దు అదుపు లేకుండా ఆకాశాన్నంటుతున్నాయని పేదలు, మధ్యతరగతి ప్రజానీకం ధరల కోరల్లో చిక్కుకు పోతున్నారని అన్నారు. ఈ పరిస్థితి మారాలంటే ప్రజలంతా ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వేస్తున్న పన్నుల భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. మోడీ భజనలో తరిస్తున్న జగన్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అధికారంలోకి రాగానే ధరలు తగ్గిస్తానని, విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీని గాలికి వదిలేసి 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. ఇప్పుడు ఎఫ్‌పిపిసిసిఎ పేరుతో నెలవారీ అదనపు ఛార్జీలు వడ్డిస్తున్నారు.ట్రూ అప్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, ఫిక్స్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ మొదలగు పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై రుద్దారని ఈ ఒక్క సంవత్సరమే దాదాపు రూ.4 వేల కోట్లకుఉ పైగా ప్రజల నుండిఛార్జీల రూపంలో పిండుతున్నారని అన్నారు. దీనితో పేదలు, మధ్యతరగతి ప్రజలు విద్యుత్ చార్జీలు చూసి బెంబేలెత్తుతున్నారని అన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో రైతులకు ఇదిపెనుభారమవుతుందని దీనికితోడు ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెడతామంటూ ప్రజలకు షాక్ ఇస్తోందని విద్యుత్తు కొనుగోలులో ప్రైవేటు కంపెనీలకు అదనపు ధర ఇచ్చి ఆ భారాన్ని వినియోగదారులపై మోపడం అత్యంత దుర్మార్గం అని దళితులకు, గిరిజనులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అని చెప్పి ఆచరణలో అనేక సాకులు చూపుతూ ఉచిత విద్యుత్తుకు ఎగనామం పెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కదలి రండి.. భారాలపై ఉద్యమిద్దాం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా, విద్యుత్ ఛార్జీల తగ్గింపునకు ప్రజలు ఆందోళనకు సిద్ధపడాలని ప్రజలకు సిపిఎం విజ్ఞప్తి చేస్తోందని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. ఆగష్టు 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు వివిధ రూపాల్లో ఆందోళనకు సిపిఎం పిలుపునిచ్చిందని ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం అని ఆయన అన్నారు. సెప్టెంబరు 3న విరుద్యోగులతో సమావేశం, సెప్టెంబరు 4న మండల కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 30, 31 – సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1 న సచివాలయాలకు అర్జీలు అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బలరాం,దుర్గాప్రసాద్, సఖిలే సూర్యనారాయణ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విఆర్ఎలు, ప్రజాసంఘాల నాయకులు

సమస్యల పరిష్కారం కోసం విఆర్ఎల నిరసన

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విఆర్ఎలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి సిఐటియూ జిల్లా కార్యదర్శిలు బలరాం దుర్గాప్రసాద్ మద్దతు తెలిపారు. విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరభద్రం మాట్లాడుతూ విఆర్ఎల సంఘం పిలుపు మేరకు ప్రభుత్వం విఆర్ఎలకు ఇచ్చిన హామీలు నెరవేర్చమని విజయవాడ అలంకార్ సెంటర్ నందు నిరసన చేసి ప్రభుత్వానికి మా సమస్యలను తెలిపి తమ న్యాయమైన డిమాండ్లను తెలియజేసి పరిష్కారం చూపమని కోరుటకు వెళ్లగా ప్రభుత్వం విఆర్ఎలను నిరసన తెలియజేయనివ్వకుండా రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తు పోలీసులతో అక్రమంగా మా విఆర్ఎలను అరెస్టులు చేయించి, నాయకులపై దుర్మార్గంగా కేసులు పెట్టించడం జరిగిందన్నారు. విఆర్ఎ గా విధులు నిర్వహిస్తూ 10 నుంచి 15 ఏళ్ల సర్వీసు ఉన్న విఆర్ఎలను గత ప్రభుత్వాలు విఆర్ఒలుగా ప్రమోషన్ ఇస్తూ పే స్కేల్ ను అమలుచేయగా ఈ ప్రభుత్వం వచ్చాక రూ.15వేలు మాత్రమే ఇస్తూ గ్రేడ్-2 విఆర్ఒ అని మార్చి మా సర్వీసును, మా భవిష్యత్తును నాశనం చేసిందని అన్నారు. ప్రజలకు అనేక సేవలు అందిస్తున్న విఆర్ఎ లకు ఎటువంటి న్యాయం ప్రభుత్వం చేయలేదని, ఈ విషయాలపై మా సమస్యల్ని పరిష్కరించాలని రాష్ట్ర విఆర్ఎ ల సంఘం జగనన్నకు మన సమస్యలు నేరుగా చెబుదాం అని నిరసన చేయుటకు అనుమతి తీసుకుని వెళ్లిన మాపై అన్యాయంగా అప్పటికప్పుడు పర్మిషన్ రద్దు చేసి అక్రమంగా అరెస్టులు చేశారని అన్నారు. ప్రభుత్వం చేసిన ఇటువంటి చర్యలను ఖండిస్తూ మా న్యాయమైన డిమాండ్ లను నెరవేర్చాలని తెలుపుచు ప్రభుత్వం మాకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తున్నామని తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ విఆర్ఎ లకు తెలంగాణ మాదిరి పేస్కెల్ ను అమలు చేయాలని నామిని విఆర్ఎ లుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన విఆర్ఎ లకుప్రమోషన్లు ఇవ్వాలని విజయాలకు కనీస వేతనమైన రూ.26 వేల జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల జిల్లా కార్యదర్శి వీరభద్రం, అమలాపురం డివిజన్ అధ్యక్షులు త్రినాథ్, కొత్తపేట డివిజన్ అధ్యక్షులు బాలు, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షులు నాగేశ్వరరావు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, పరశురాముడు, సుబ్బారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, నూకల బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే పత్రిక 'ప్రజాశక్తి'

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

'ప్రజాశక్తి' పత్రిక అను నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ అన్నారు. అమలాపురం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి విశ్వరూప్ బుధవారం 'ప్రజాశక్తి' 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రిక పరిశీలనా, పరిశోధనాత్మకం కథనాలు ప్రచురించడంలో సాటి అని ప్రత్యేకంగా కొనియాడారు. ప్రజలు మన్ననలు పొందుతూ 43 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రజాశక్తి దినపత్రికకు ఆయన ప్రత్యేక శుభాభినందనలు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ పావనమూర్తి, ఉప్పలగుప్తం జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, ఉప్పలగుప్తం మండల సర్పంచల సమైక్య అధ్యక్షుడు కమిడి చిన్నవరావు, జిల్లా పాత్రికేయులు సురేష్,కుమార్, రాజశేఖర్, వీరబాబు,భీమేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రజాశక్తి వార్షికోత్సవ సంచికను విడుదల చేస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

ఘనంగా రాఖీ పండుగ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక సంగమేశ్వర కాలనీలోని ఎంపిపి పాఠశాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ముత్యాల మాణిక్యాంబ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి పండుగ బుధవారం నిర్వహించారు. పేద, ధనిక, కుల, మత, వర్ణ వైషమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఈ రాఖీ పండుగను జరుపుకోవాలని ఉపాధ్యాయులు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



నగదు సాయం అందజేస్తున్న రమణారావు

బాధితునికి 'గుడ్‌సీడ్' రూ.25వేల సాయం

ప్రజాశక్తి-అమలాపురం

బ్లడ్‌కేన్సర్‌తో బాధపడుతూ విశాఖపట్నంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకునికి అమలాపురం నియోజకవర్గ వైసిపి నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు బుధవారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. అమలాపురం రూరల్ మండలం కామనగరువు కు చెందిన దోనిపాటి సందీప్ బ్లడ్‌కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని బాధితుని కుటుంబ సభ్యులు రమణారావు దష్టికి తీసుకువెళ్లడంతో రమణారావు స్పందించి ఈ ఆర్థిక సాయాన్ని సందీప్ కుటుంబ సభ్యులకు గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, కుంచే అర్జున్, నేరేడుమిల్లి శ్రీను, పరమట రాజేష్, దోనిపాటి రాంబాబు, పోలినాటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాతపద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు చేయాలి

దస్తావేజు లేఖర్ల నిరసన

ప్రజాశక్తి-రామచంద్రపురం

రిజిస్ట్రేషన్ అన్ని పాత పద్ధతిలో స్టాంపులు ద్వారా కొనసాగించాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు రామచంద్రపురం దస్తావేజు లేఖర్ల సంఘం పెన్ డౌన్ కార్యక్రమాన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేఖర్ల వ్యవస్థ బ్రిటీష్ కాలం నుంచి 1906లో ఏర్పటు చేశారని, నేటి వరకుకొనసాగుతుందన్నారు. ప్రభుత్వం నూతనం గా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 వల్ల దస్తావేజు లేఖర్ల వ్యవస్థ,ను నాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 296 సబ్ రిజిస్టర్ ఆఫీసుల్లో 30 వేల మంది లేఖర్లు, సహాయకులు, స్టాంపు వెండర్లు, డిటిపి ఆపరేటర్లు ఉన్నారన్నారు. వీరంతా రోడ్డును పడే అవకాశం ఉందన్నారు. ప్రైమ్ 2.0 వ్యవస్థ వల్ల పూర్వం బ్రిటిష్ కాలం నాటి దస్తావేజు పోయి తెల్ల కాగితంపై దస్తావేజులు వచ్చాయ అన్నారు. ప్రైమ్ 2.0 వ్యవస్థ వల్ల భూమిని అమ్ముకునే రైతుకు భూమిని కొనుక్కునే రైతుకు ఈమెయిల్ ఐడి, ఆధార్ కార్డులకు ఒటిపిలు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు ఉన్నాయి. చిన్నరైతులకు పల్లెటూరులో ఇటువంటి నిబంధన వల్ల రిజిస్ట్రేషన్‌లు ఆగిపోయి, వారికి మరింత కష్టాలు పెట్టే వ్యవస్థగా మారిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రైమ్ 2.0 వ్యవస్థను రద్దు చేయాలని, యథావిధిగా పాత పద్ధతిలోనే స్టాంపులు ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ రెండు రోజులు రాష్ట్ర లోని దస్తావేజు లేఖర్లు పెన్డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపామన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం దస్తావేజు లేఖర్లు, వెదుళ్ళ విజయభాస్కర్, మల్లిడి సాయిబాబారెడ్డి, సత్తి గంగిరెడ్డి, రఘురాం, గిరిజాలవెంకటేశ్వరరావు, పొక్కులూరి వెంకటేశ్వరరావు, అడపా రాంబాబు, తాడి వీర గోపాల్ రెడ్డి, చందు, ఆదిత్య, తాడి జయభారతరెడ్డి తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. **కొత్తపేట** మన పూర్వ తరాల నుండి ఉన్న అందరికీ తెలిసిన భూమి దస్తావేజుల యొక్క దస్తావేజు స్టాంపులను నిలుపుదల చేయడంపట్ల కొత్తపేటలో లేఖర్లు, దస్తావేజు సహాయకులు స్టాంప్ వెండర్లు బుధవారం నిరసన వ్యక్తం చేశారు ఇప్పుడున్న స్టాంపు దస్తావేజు స్వరూపాన్ని మార్చి ప్రైమ్ 2.0 కంప్యూటర్ ఆన్లైన్ ద్వారా నాశిరకం పేపర్‌పై ఈ-మెయిల్ ప్రింటింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ పత్రం ఇవ్వాలనే ప్రభుత్వ విధానాలకు నిరసన వ్యక్తం చేశారు దస్తావేజు లేఖర్ల లైసెన్స్‌ పునరుద్ధరించాలని యథావిధిగా దస్తావేజు స్టాంపులు ముద్రణ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్టాంపు దస్తావేజుల స్వరూపము యథావిధంగా కొనసాగించాలని కోరుతూ బుధ, గురు వారం రెండు రోజులు పాటు కొత్తపేటలోని దస్తావేజు లేఖర్లు, సహాయకులు మరియు స్టాంపు వెండర్లు 'పెన్ డౌన్' కార్యక్రమం చేయటకు నిర్ణయించారు. ప్రజలు సహకరించాలన్నారు.


రామచంద్రపురంలో నిరసన తెలియజేస్తున్న దస్తావేజు లేఖర్లు


కొత్తపేటలో నిరసన తెలుపుతున్న దృశ్యం

ఎంపిక చేసిన గ్రామాల్లో పంట రుణాలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

జిల్లాలోని 22 మండలాలకు సంబంధిం చి ప్రతి మండలానికి రెండు గ్రామాలు చొప్పున పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి కౌలు రైతులకు పంట రుణాలు అందిస్తున్నట్లు ఎడిఎ కాకి నాగేశ్వరరావు తెలిపారు. టేకి గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు 44 గ్రామాల్లో 1,025 మంది కౌలు రైతులకు రూ.5.44 కోట్ల పంట రుణాలు అందజేసినట్లు తెలిపారు. మండపేట నియోజకవర్గానికి సంబంధించి 246 మంది కౌలు రైతులకు రూ.కోటి 30 లక్షలు పంట రుణాలు పంపిణీ చేశామని అన్నారు. నియోజకవర్గంలో 46 వేల ఎకరాలు వరి సాగులో ఉందన్నారు. పంట నమోదు ప్రారంభిం చడం జరిగిందని ఇందుకోసం ప్రతి సర్వే నెంబర్ కు వెళ్లి ఫొటో తీస్తారని అన్నారు. ప్రస్తుతానికి 11 వేల ఎకరాల్లో పంట నమోదు పూర్తయిందని అన్నారు. సెప్టెంబర్ 15 నాటికి ప్రక్రియ పూర్తి చేసి ఆర్‌బికెల్లో ప్రచురి స్తారన్నారు. వీటిపై అభ్యంతరాలుంటే మార్పులు, చేర్పులు, చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎఒ రమేష్ కుమార్ పాల్గొన్నారు .


అభినందనలు తెలుపుతున్న గోగుల్లంక పెద్దలు

ఎంఎల్‌ఎ పొన్నాడకు అభినందనలు

ప్రజాశక్తి -ఐ.పోలవరం

టిడిడి నూతన పాలక మండలి సభ్యునిగా నియమితులైన ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌ను బుధవారం గోగుల్లంక-జి.మూలపొలం గ్రామానికి చెందిన లంకే హరిబాబు, ప్రసాద్, ఇసుకపట్ల అచ్చిబాబు, చింతా ఏడుకొండలు, బొమ్మిడి సత్యనారాయణ పడాల సత్తిబాబు, మంద పాటి భైరవస్వామి, కాటంసత్తిరాజు దంపతులు పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినం దించారు. వారితో పాటు బొమ్మిడి సత్య నారాయణ, రేఖాడి దుర్గారావు, సంగాని వీరబాబు, కొల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామిని దర్శించుకున్న సివిల్ జడ్జి

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో బుధవారం దర్శించుని ప్రత్యేక పూజలుచేశారు. వై.శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులకు ఆలయ ఛైర్మన్ సిహెచ్.రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి, వేద పండితులతో ఆశీర్వాదం అందజేసి సత్కరించారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.మాధవి తెలి పారు.


స్వామి వారి చిత్రపటం అందజేసున్న దృశ్యం

పాత ఆలయానికి వితరణ

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి (పాత దేవాలయం)కి నగరం వాసులు రొక్కాల రాజారావు మరియు కుటుంబ సభ్యులు భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.90 వేలతో స్టీల్ క్యూ లైన్ మరియు రూ.20వేలతో ఇన్వెర్టర్‌తో బు ధవారం సమర్పించారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.మాధవి తెలిపారు. ఆలయ ఛైర్మన్ సిహెచ్.రామకృష్ణ , ధర్మకర్తల మండలి సభ్యులు ప్రారంభించారు.



నవీన్‌కు కాజా బహూకరిస్తున్న వర్మ

నవీన్ పోలిశెట్టికి 'సురుచి' సత్కారం

ప్రజాశక్తి-మండపేట

యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై పి. దర్శకత్వంలో నిర్మించిన నవీన్ పోలిశెట్టి, అనుష్క శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన 'మిస్ శెట్టి-మిసెస్ పోలిశెట్టి' సినిమా ప్రమోషన్ కోసం రాజమహేంద్రవరం వచ్చిన పోలిశెట్టి నవీన్ ను సురుచి పిఆర్ఒ వర్మ శాలువతో సత్కరించారు. సురుచి బాహుబలి కాజాతో పాటు స్పెషల్ మిఠాయిలను బహూకరించారు.

కోవిడ్ ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలి

అధికారులకు బాధితురాలి వినతి

ప్రజాశక్తి-కాట్రేనికోన

కోవిడ్ ఎక్స్‌గ్రేషియా-19 విప్పించాలని ఓ బాధితురాలు అధికారులను వేడుకుంటోంది. అయితే బాధితురాలు జగనన్నకు చెబుదాంకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు సరి కదా పరిష్కరించామంటూ ఫిర్యాదును ముగించేశారు. అధికారులకు పలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.

వివరాలు ఇవి.. కాట్రేనికోన మండలం, నడవపల్లి గ్రామానికి చెందిన కొంకి మంగాదేవి ఆవేదనగా చెబుతోంది. తన భర్త సింహాద్రి కాకినాడ జిజిహెచ్ లో కోవిడ్ తో మతి చెంది రెండేళ్లు అయినా కోవిడ్ -19 ఎక్స్‌గ్రేషియా అందలేదు. మంజూరైన రూ.50,000 సొమ్మును కూడా సిబ్బంది పక్కదోవ పట్టించారు. ఇది ఎక్కడో కాదు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే కోవిడ్ అక్రమాలు జరిగినట్లు స.హ.చట్టం ద్వారా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు కొంకి మంగాదేవికి బ్యాంక్ అకౌంట్ లో జమ చేయాల్సిన ఎక్స్‌గ్రేషియా రూ.50,000 లు సొమ్మును వేరే ఎస్‌బిఐ అకౌంటు నెంబర్: 30579550429, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్:ఎస్‌బిఐఎన్ 0009389 కు బదలాయించడంతో ఆమె లబోదిబో అంటోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎన్ని దరఖాస్తులు చేసినా తమకు సంబంధం లేదంటూ బుట్టదాఖలా చేస్తున్నారని ఆమె వాపోతోంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం వారు ఈ సమస్య కాకినాడ కలెక్టర్ పరిధిలోకి వస్తుందని, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు కాకినాడ కలెక్టర్ ఆఫీస్ లో సంప్రదించాలని నెలలు తరబడి కాలయాపన చేస్తున్నారు. పరిష్కారం మాత్రం చేయడం లేదు.

జిల్లా వైద్యాధికారుల లేఖలో సూచన మేరకు కాకినాడ కలెక్టర్ కార్యాలయం హెచ్ సెక్షన్ విభాగానికి వెళ్లినా సొమ్ము ఎవరికి వెళ్లిందో సరైన సమాచారం చెప్పకుండా దాచిపెడుతున్నారని బాధితురాలు మంగాదేవి వాపోతోంది. తనకు అందాల్సిన కోవిడ్ ఎక్స్‌గ్రేషియా సొమ్మును వేరే వారి అకౌంట్లో జమ చేయడం ఏంటని, పొరపాటు జరిగితే సరిదిద్దాల్సిన బాధ్యత అధికారులకు లేదా అంటూ ఆమె ఆవేదనగా ప్రశ్నిస్తోంది. ఆ పేద బాధిత మహిళ విన్న పాలు వినే అధికారులు, ప్రజా ప్రతినిధులు కరువయ్యారు. ఇకనైనా నిష్పక్షపాతంగా విచారణ చేసి తనకు రావాల్సిన సొమ్మును ఇప్పించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ కు బాధిత మహిళ మంగాదేవి విజ్ఞప్తి చేస్తోంది. బాదిత కుటుంబాలకు అందాల్సిన కోవిడ్ ఎక్స్‌గ్రేషియా సొమ్ము పంపిణీ లోనూ అక్రమాలు జరగడం పట్ల పలువురు ఆవేదన చెందుతున్నారు. అవినీతి లేని పాలన అందిస్తున్నామంటున్న ప్రభుత్వం ఇకనైనా చర్యలు చేపట్టి బాదిత కుటుంబాలకు న్యాయం చేయాలని సర్వత్రా కోరుతున్నారు.

'వక్ఫ్' భూముల వేలం నిలిపివేయాలి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

జిల్లా పరిధిలోని అమలాపురం రూరల్ మండలం తాండవ పల్లి గ్రామానికి చెందిన వక్ఫ్ బోర్డు కింద ఉన్నటువంటి భూములను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా వేలంపాట నిర్వహించడంపై తాండవపల్లి వక్ఫ్ బోర్డు భూముల బాధితులు బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గత 100 సంవత్సరాలుగా అమ్మిన భూమి రిజిస్ట్రేషన్ అయ్యి పాసుబుక్కులు కలిగి ఉన్నటువంటి భూములువేలం వేలంపాటలు ఎలా వేస్తారని బాధితులు తహశీల్దార్‌ను నిలదీశారు. వక్ఫ్ బోర్డు భూములను రెండు కుంచాలు, మూడు కుంచాలు, ఐదు కుంచాల లోపే కొనుగోలు చేసిన చిన్న, సన్నకారు రైతులని ఎకరం భూమి పైబడి ఎవరూ లేరని అటువంటి వారిని ఈ విధంగా ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. తమకు అమ్మిన భూములను వేలంపాట వేసేందుకు తహశీల్దార్‌కు అధికారం ఎవరిచ్చారని బాధితుల ఆరోపించారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన

'బండారు' గృహనిర్బంధం

ప్రజాశక్తి-కొత్తపేట

ఇసుక రీచ్‌ల ముట్టడి నేపథ్యంలో వాడపాలెంలోని నివాసంలో టిడిపి నాయకుడు బండారు సత్యానందరావును బుధవారం పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక దోపిడీపై రీచ్‌లను, మైనింగ్ శాఖ కార్యాలయాన్ని ముట్టడించాలని టిడిపి నిర్ణయించిందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఎపిలో ఇసుక కుంభకోణం జరుగుతోందని, వైసిపి నేతలకు జిల్లాల వారీగా భాగాలు పంచేసి రూ.వేల కోట్లు దండుకుంటున్నారని అన్నారు. నాలుగున్నరేళ్లుగా భారీ కుంభకోణాలన్నింటికీ ఆంధ్రప్రదేశ్‌ను అడ్డాగా మార్చేశారన్నారు. ఇసుక నుంచి మద్యం వరకు రూ.వేల కోట్ల కుంభకోణాలు జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి విచారణ చేపట్టాలన్నారు.

కార్టూన్ 'నిజం'



అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పార్కింగ్ ప్రదేశంలో వకుళ మాత అన్నదాన భవనం నిర్మాణాని బుధవారం రాజమహేంద్రవరానికి చెందిన మల్లిపూడి చల్లా రావు మంగాయమ్మ దంపతులు రూ.1 విరాళాన్ని ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఇఒ ఎం.సత్యనారాయణ రాజులకు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం చేయించి చిత్రపటం అందజేశారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-చాగల్లు

మోటార్ సైకిల్ అదుపుతప్పి కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వద్ధురాలు సోమవారం రాత్రి మతి చెందినట్లు చాగల్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన ఎం.గంగమ్మ (60) ఈ నెల 25న బంధువుతో కలిసి నిడదవోలు దేవాలయానికి వెళ్లారు. చాగల్లు మండలం ఎస్.ముప్పవరం గ్రామానికి వచ్చేసరికి వెనక కూర్చున్న గంగమ్మకింద పడిపోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో నిడదవోలు ప్రభుత్వాసుపత్రి తరలించారు. అక్కడి నుంచి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గంగమ్మ మృతి చెందినట్టు ఎఎస్ఐ ఎస్కె.హుస్సేన్ తెలిపారు.



వంతెన వద్ద మాట్లాడుతున్న హక్కుల సంఘం నాయకులు

పిఠాపురం-సామర్లకోట రోడ్డును నిర్మించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

నాలుగేళ్లుగా పూర్తిగా శిథిలమై రాకపోకలకు అవకాశం లేకుండా ఉన్న సామర్లకోట -పిఠాపురం రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించాలని జిల్లా మానవ హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సామర్లకోట పిఠాపురం రోడ్డులో గత 4 సంవత్సరాల క్రితం కూలిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేసినందుకు అభినందనలు తెలుపుతున్నామని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా రక్షణ గోడ నిర్మాణం చేపట్టక పోవడం, అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారని దీనిపై జిల్లా కలెక్టర్‌కు, ఆర్ అండ్ బి మంత్రికి విన్నవించగా వారు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేశారన్నారు. సామర్లకోట పిఠాపురం మధ్య త్వరలో ఆర్‌టిసి బస్సులు నడిపేందుకు త్వరలో చర్యలు తీసుకొనున్నట్లు ఆర్‌టిసి ఉన్నతాధికారులు ప్రకటించడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు. సత్వరమే రోడ్డు పనులు చేపట్టి, ఆర్‌టిసి బస్సుల రాకపోకలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కుంచే నానిబాబు, జుత్తుక అప్పారావు, ఎం.డీ వలీబాషా తదితరులు పాల్గొన్నారు.

తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డు పనులు

ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డు పనులు ఇటీవల పున:ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 1200 మీటర్ల మేర ఒకవైపు రోడ్డు శుభ్రపరిచినట్లు రోడ్డు భవనాల శాఖ ఎఇ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. గురువారం నుంచి రోడ్డు బాగా దిగబడిన ప్రాంతాల్లో 4 అంగుళాలతో మొదటి లేయర్ వేసి తదనంతరం త్వరితగతన రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు.



ముఖ్యమంత్రికి రాఖీ కడుతున్న ఎంపీ చింతా అనురాధ

సిఎం జగన్‌కు రాఖీ కట్టిన అమలాపురం ఎంపీ

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రాఖీపౌర్ణమి సందర్భంగా అమలాపురం ఎంపీ చింతా అనురాధ రాఖీ కట్టారు. బుధవారం కాకినాడ జిల్లా జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహ వేడుకలో పాల్గొనేందుకు సిఎం జగన్ వచ్చారు. ఈసందర్భంగా సిఎం జగన్‌కు హెలిప్యాడ్ వద్ద అమలాపురం ఎంపీ అనురాధ రాఖీ కట్టారు.



జెసిబి

నిరుపయోగంగా జెసిబి


ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం మున్సిపాలిటీలో జెసిబి చెత్త ఎత్తుతుంది. అయితే దీనిని నెల రోజులుగా మూలన పెట్టేశారు. ఇది రోడ్డు పై ఉండే చెత్తను నిరంతరం ఎత్తివేస్తుంది. మరమ్మతుల పేరిట భారీగా ఖర్చు చేశారు. అధికారులు ఏమనుకున్నారో తెలియదు గాని రూ.లక్షలాది విలువ చేసే ఈ వాహనాన్ని పక్కన పెట్టేశారు. జెసిబి నిరుపయోగంగా ఉండటంతో మున్సిపాలిటీలో ఎక్కడకక్కడ మూలల్లో చెత్త దర్శనమిస్తోంది.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి-కోటనందూరు, గండేపల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రి చేస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి యనమల కృష్ణుడు అన్నారు. బుధవారం తుని రూరల్ డి.పోలవరంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలన దక్షత గల నాయకుడు రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. అప్పులు ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే టిడిపికి ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా డి.పోలవరం సర్పంచ్ డాక్టర్ పలక సోమేశ్వరరావు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో పోల్నాటి శేషగిరి, మోటుకూరు వెంకటేష్, సొర్ల లోవరాజు, ఇ.సత్యనారాయణ, వంగలపూడి బుజ్జి పాల్గొన్నారు.



గండేపల్లిలో..



తునిలో..

గండేపల్లి మండలం మల్లేపల్లిలో టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ మహిళల చైతన్య రథయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మహాశక్తి చైతన్య రథయాత్ర కమిటీ డాక్టర్ పాలూరి బోసు బాబు, దాపర్తి సీతారామయ్య, కంచుమర్తి రాఘవ హాజరై గ్రామంలో ఇంటింటికీ తిరిగి టిడిపి మేనిఫెస్టోను వివరివంచారు. ఈ కార్యక్రమంలో కొత్త కొండబాబు, అడబాల భాస్కరరావు, సుంకవిల్లి రాజు, పోసిన ప్రసాద్, దిడ్డి శ్రీను, కాటేపల్లి భద్రరావు, చింతపల్లి భద్రరావు, తెలగ రెడ్డి ప్రకాష్, కొల్లు త్రిమూర్తులు, తెలగ రెడ్డి వీరభద్రరావు, తిప్పన సత్యవతి, పోలినాటి ధర్మానందకుమారి, నక్కిరెడ్డి సూర్యవతి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

జి.మామిడాడ మండల సాధన కోసం ర్యాలీ

ప్రజాశక్తి-పెదపూడి

గొల్లలమామిడాడ గ్రామాన్ని ప్రత్యేక మండలంగా విభజించాలని పలు పార్టీలతో కలిసి ప్రజలు బుధవారం ర్యాలీ, మానవహారం చేపట్టారు. గొల్లలమామిడాడ, పైన, రాజుపాలెం, గంధ్రేడు, చింతపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, అఖిలపక్షం వైసిపి, తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి నాయకులంతా కలిసి ర్యాలీ, మానవహారాలు నిర్వహించారు. పెదపూడి మండలాన్ని రెండుగా విభజించి తొమ్మిది గ్రామాలను పెదపూడి మండలంగా తొమ్మిది గ్రామాలను గొల్లలమామిడాడ మండలంగా విడదీయాలంటూ గొల్లలమామిడాడ జిఆర్ఎస్ఎ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ నుంచి మామిడాడ గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నేతలు మాట్లాడుతూ పెదపూడి మండలం నుంచి తొమ్మిది గ్రామాలను విడదీసి గొల్లల మామిడాడ మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఎన్నో ప్రయత్నాలు చేసి కోర్టులు చుట్టూ తిరిగారన్నారు. ఒక కోర్టులో నెగ్గితే మరో కోర్టులో అడ్డుకునేవారని చెప్పారు. గొల్లలమామిడాడ మండలంపై ఎవరూ తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని కోరారు.

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట పంచారామ క్షేత్రం కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి చెన్నైకు చెందిన ఎర్రబోలు సత్య జగన్నాథరావు, విజయ దంపతులు రూ.2 లక్షలు విరాళంను బుధవారం ఆలయ ఇఒ డి.నాగమల్లేశ్వరరావుకు అందచేశారు. ఆలయ నంది మండపంలో ఇఒకు దంపతులు చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ ఆధ్వర్యంలో ఆలయ పండితులతో దాత దంపతులకు ఆశీర్వచనాలు అందచేసి, ప్రసాదాలు, స్వామివారి చిత్రపటంను అందచేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురానికి చెందిన కర్రి వెంకటరాజు, ఆలయ అర్చకుడు సన్నిధిరాజు వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దాపరంలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న దొరబాబు

ప్రభుత్వాసుపత్రుల్లో క్యాంటీన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-ఏలేశ్వరం, పెద్దాపురం

ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి ఆహా క్యాంటీన్ మంజూరైనట్టు నగర పంచాయతీ కమిషనర్ కెవి.కొండలరావు తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిచే ఈ క్యాంటీన్‌ను గురువారం కాకినాడ ఎంపీ వంగా గీత, ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ క్యాంటీన్ ద్వారా రోగులు, వారి బంధువులకు నాణ్యమైన ఆహారం అందిస్తామన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటుచేసిన ఆహా క్యాంటీన్‌ను బుధవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ప్రోత్సాహంతో శ్రీలక్ష్మి స్వయం సహాయక సంఘం సభ్యులు ఈ క్యాంటీన్ ను నిర్వహిస్తారని మెప్మా సిఒలు తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు, వారి బంధువులకు తక్కువ ధరలకు ఈ క్యాంటీన్ ద్వారా ఆహార పదార్థాలను సరఫరా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు విడదాసరి రాజా, కట్టా రాజబాబు, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, మెప్మా సిఒలు శ్రీదేవి, ఉమాపార్వతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలుగా కోటిపల్లి రేవులో నిలిచిన ప్రయాణాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

జూలై నెలలో గోదావరికి వచ్చిన వరదలు కారణంగా కోటిపల్లి గోదావరి మూతపడింది. అమలాపురం తదితర కోనసీమ ప్రాంతాల నుంచి ద్రాక్షారామ కాకినాడ వెళ్లే ప్రయాణికులంతా ఈ రేవును ఉపయోగిస్తారు. కోనసీమ ముక్తేశ్వరం నుంచి పశువుల వ్యాపారులు సైతం కోటిపల్లి రేవునే ఉపయోగిస్తారు. దీంతో దగ్గర దారి కావడంతో కోటిపల్లి రేవు నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతుంది. వరదల కారణంగా మూసిన రేవును రెండు నెలలైనా తెరవకపోవడంతో ప్రయాణికులు అమలాపురం యానం మీదగా చుట్టు తిరిగి రావాల్సి వస్తుంది లేదా రావులపాలెం నుంచి మండపేట మీదగా ద్రాక్షారామ కాకినాడ చేరుకోవాల్సి వస్తుంది. రేవును వెంటనే పునరుద్ధరించి ప్రయాణాలు కొనసాగించాలని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.



కోటిపల్లి రేవు

అయిదు నెలలైనా జరగని వేలం

కోటిపల్లి రేవుకు ప్రతి ఏట మార్చిలో మండల పరిషత్తు బహిరంగ వేలం నిర్వహిస్తుంది. ఈ ఏడాది అయిదు నెలలు గడిచినా వేలం జరగకపోవడం విశేషం. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో గల కోటిపల్లి రేవుకు మే నెలలో వేలం నిర్వహించిన ఆశించిన స్థాయిలో టెండర్లు దక్కలేదు దీంతోపాటు ఆయుదావేశారు. పాటకు ఎవరూ ముందుకు రాక పోవడంతో మళ్లీ బహిరంగ వేలం నిర్వహిస్తామని అధికారులు చెప్పినప్పటికీ నేటికీ అమలు కాలేదు.

ఎంపిడిఒ వివరణ

కోటిపల్లి రేవు ఐదు నెలలుగా బహిరంగ వేలం నిర్వహించకపోవడంతో కె.గంగవరం మండల పరిషత్ అధికారి ఎం.శ్రీనివాస్‌ను వివరణ కోరగా తాము ప్రభుత్వ అధికారులకు రెండవసారి బహిరంగ వేలం నిర్వహించేందుకు అనుమతి కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. సెప్టెంబర్ లో అనుమతులు వచ్చిన వెంటనే తిరిగి బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం రేవును వెంటనే పునరుద్ధరించి ప్రయాణాలు కొనసాగించాలని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

కిడ్నీ బాధితునికి రూ.10 వేల సాయం

ప్రజాశక్తి-అమలాపురం

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి వికలాంగుల సంక్షేమ సంఘం పినిపే గ్రంధి ఫాలోవర్స్ కువైట్ ఎన్నారై గ్రూప్ బుధవారం రూ.10వేల సాయం అందజేశారు. వివరాలు ఇవి.. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నరసాపురానికి చెందిన సురేంద్ర అమలాపురంకిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వికలాంగుల సంక్షేమ సంఘం పినిపే గ్రంధి ఫాలోవర్స్ కువైట్ ఎన్నారై గ్రూప్ బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని, రూ.10వేల సహాయం కిమ్స్ ఆస్పత్రి వద్ద బాధితునికి అందజేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు ఒంటెద్దు వెంకన్న నాయుడు రూ.4 వేలు ఆర్థిక సహాయం పినిపే గ్రంధి ఫాలోవర్స్ కువైట్ ఎన్ఆర్ఐ గ్రూపు వ్యవస్థాపకులు మోకా సువర్ణరాజు రూ.6వేలు ఆర్థిక సహాయం మొత్తం రూ.10వేలు కిడ్నీ బాధితుడికి అందజేశారు. ఆర్థికసాయాన్ని వడ్డీల సంఘం గౌరవాధ్యక్షులు నగబేరి కష్ణమూర్తి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వికలాంగులసంక్షేమ సంఘం అధ్యక్షులు నాగవరపు పరుశురాముడు చేతుల మీదుగా ఈ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పాడి నాగరాజు, పెనుమాల నాగరాజు, బొంతు శ్రీనివాసు, నిమ్మకాయల సురేశ్, సాధనాల విఘ్నేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

'వూటుకూరి'కి ఘన సత్కారం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు, రాష్ట్ర వీవర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షునిగా ఎన్నికైన కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూటుకూరి సుబ్రమణ్య స్వామిని పుల్లేటికుర్రు దేవాంగ ప్రముఖులు బుధవారం సత్కరించారు. ఈలో కారుపర్తి నాగమల్లేశ్వరరావు సిద్ధాన్తి, దైవపు నందయ్య, బల్ల పుల్లేశ్వరరావు, మాపూరి వీరవెంకటసత్యన్నారాయణ, బల్ల వెంకటసుబ్బారావు, పిచ్చిక విశ్వేశ్వరరావు, గుంటూ ఫణి ప్రసాద్, పిచ్చిక శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



వూటుకూరి సుబ్రమణ్య స్వామిని సత్కరిస్తున్న పెద్దలు

అమ్మవారికి బంగారం, వెండి ఆభరణాల బహూకరణ

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

అంగరలో కొలువై ఉన్న కమ్మవారి మధ్యాహ్నపు అమ్మవారికి బుధవారం బంగారం, వెండి, ఆభరణాలు దాతలు బహూకరించారు. కాకినాడకు చెందిన వోగిరాల వెంకటేశ్వరరావు,వెంకట లక్ష్మీ మహేశ్వరి దంపతులు 10 గ్రాముల బంగారు త్రినేత్రం, బొట్టు, కేజీ 10 గ్రాముల వెండితో అమ్మవారి చేతి హస్తం, కుంకుమ భరిణి, మొత్తం రూ.లక్షా70వేలు విలువగల ఆభరణాలను అమ్మవారి ఆలయంలో అందజేసినట్లు వారు తెలిపారు.

యానాం వార్తలు



కృష్ణభగవాన్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ అశోక్

సూర్యభగవాన్ కు నివాళులు

ప్రజాశక్తి -యానాం

విశాఖజిల్లా అనకాపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన దొమ్మేటిపేటకు చెందిన దొమ్మేటి కృష్ణసూర్యభగవాన్ మృతదేహానికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ ఆశోక్ ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఆయన దొమ్మేటిపేట భగవానం ఇంటికి వెళ్లి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. కృష్ణభగవాన్ భౌతికదేహానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తదితరులు ఘనంగా నివాళులర్పించారు.



కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

ఉపకరణాల పంపిణీకి వికలాంగుల గుర్తింపు

ప్రజాశక్తి - యానాం

కోల్కతాకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకోమోటార్ డిజెబిలిటీస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని వికలాంగులకు సహాయపరికరాల పంపిణీ కోసం బుధవారం గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లంకే ప్రసన్న మాట్లాడుతూ వికలాంగులకు అవసరమైన సహాయపరికరాలను భారతప్రభుత్వ సామాజిక, న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ సహకారంతో ట్రై సైకిల్స్, వీల్‌ఛైర్స్ అంది స్తున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి, డాక్టర్ గంగాధ రరావు, అమర్ బిస్వాస్, దీపి మిశ్రా ఉన్నారు.